సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం ı 6 ı మార్చి ı 2023



పశువులకు టీకా రక్షణ

గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా జిల్లావ్యాప్తంగా గాలికుంటు టీకా కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. - 8లో



కారుబైక్ ఢీ: ఒకరి మృతి

రైల్వేకోడూరు మండలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.6/15.7

వాతావరణం

జిల్లాలో ఆదివారం 15.7 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రామయ్యకు వెండి పంచ పాత్రలు సమర్పణ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణులకు వంశీ కృష్ణ అనే భక్తుడు వెండి పంచ పాత్రలను సమర్పించినట్లు ఆదివారం ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని మలక్‌పేటకు చెందిన వంశీ కృష్ణ అనే భక్తుడు దాదాపు రూ. 2 లక్షలు విలువ చేసే వెండి పంచపాత్రలను స్వామి వారికి సమర్పించారన్నారు. ఆ వెండి ఆభరణాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసి, ఆలయ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

నేడు జిల్లాకు రానున్న ఎన్నికల పరిశీలకులు

కడప సిటీ : కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల పరిశీలకులు సోమవారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్, సెక్రటరీ–2 గవర్నమెంట్ (ఎఫ్‌ఏసీ), జీఏడీ (సర్వీస్ అండ్ హెచ్‌ఆర్‌ఎం) డాక్టర్ పోలా భాస్కర్, దేవదాయశాఖ కమిషనర్ ఎం.హరి జవహర్ లాల్‌లను ఎన్నికల పరిశీలకులుగా భారత ఎన్నికల సంఘం నియమించిందని తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో వారు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ వివరించారు.

నేడు తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ జిల్లాలోని వివిధ డిపోల నుంచి సోమవారం తిరువణ్ణామలైకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని కడప, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మల మడుగు డిపోల నుంచి బస్సులు నడుస్తాయన్నారు. కడప నుంచి రాత్రి 9.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. పులివెందుల నుంచి రాత్రి 8.00 గంటలకు బయలుదేరే బస్సు వేముల, వేంపల్లె మీదుగా, బద్వేలు నుంచి రాత్రి 9.00 గంటలకు బయలుదేరే బస్సు కడప మీదుగా, మైదుకూరు డిపోకు చెందిన బస్సు ఉదయం 5.30 గంటలకు పోరుమామిళ్ల నుంచి కడప, కాజీపాకం, గోల్డన్ టెంపుల్ మీదుగా, ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9.00 గంటలకు, జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బయలుదేరే బస్సు ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప మీదుగా వెళతాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి సోమవారం మల్లయ్య కొండకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ 1డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రెండు సర్వీసులు ఉదయం 5, 6 గంటలకు మదనపల్లె నుంచి నేరుగా మల్లయ్యకొండపైకి వెళతాయన్నారు. తంబళ్లపల్లె పాత బస్టాండు నుంచి మల్లయ్యకొండకు ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు నడుస్తాయన్నారు.

ఒక్క క్లిక్‌తో దస్తావేజులు ప్రత్యక్షం

ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణకు శ్రీకారం చుట్టింది. దీనివల్ల ప్రజలకు త్వరలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ఆధారిత సేవలు అందుబాటులోకి రానున్నాయి.

- కొత్త రూపు సంతరించుకుంటున్న పాత డాక్యుమెంట్లు
- జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 16,960 వాల్యూమ్స్
- ఇప్పటివరకు 11,802 వాల్యూమ్స్ పూర్తి
- 1857-1999 డాక్యుమెంట్ల డిజిటలైజేషన్
- వీటి ద్వారా సులువుగా ఈసీలు పొందే అవకాశం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు ప్రారంభం
- దువ్వూరులో పూర్తి.. మిగతా ప్రాంతాల్లో చురుగ్గా ప్రక్రియ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఒక ఆస్తిని కొనుగోలు చేయాలన్నా.. తనాఖా పెట్టాలన్నా.. వాటి పాత డాక్యుమెంట్లు చూసుకోవడం పరిపాటి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో 1857 నుంచి 1999 వరకు ఉన్న పాత డాక్యుమెంట్ల పత్రాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు. ప్రస్తుతం 1999 తర్వాత జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్ వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి.అంతకుముందు వాల్యూమ్ బుక్‌లో క్రయ, విక్రయ వివరాలను నమోదు చేసేవారు. అవి మ్యాన్యువల్ రికార్డుల రూపంలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాటి నిర్వహణ కొరవడి విలువైన సమాచారం చేజారిపోతోంది. కాలక్రమంలో అవి శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వాటిని డిజిటలైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కడప అర్బన్, రూరల్, బద్వేలు, దువ్వూరు, జమ్మలమడుగు, కమలాపురం, ముద్దనూరు, మైదుకూరు, పులివెందుల, వేంపల్లె, ప్రొద్దుటూరు, సిద్దవటంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయల్లో డిజిటలైజేషన్ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే ఆన్‌లైన్ సేవలు వినియోగదారులకు అందనున్నాయి.

సంస్కరణలు

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖా కార్యాలయాల్లో సంస్కరణలు చేయాలని పూనుకుంది. 1857 నుంచి 1999 వరకు జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.



కడపలో వాల్యూమ్స్ స్కాన్ చేస్తున్న సిబ్బంది

అత్యాధునిక స్కానర్లు

పాత రికార్డుల డిజిటలీకరణకు అధునాతన స్కానర్లను వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆరు నెలల్లోగా దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 10 నుంచి 15 పేజీలను స్కాన్ చేసే సామర్థ్యం ఉన్న పెద్ద స్కానర్లను మూడు నుంచి ఐదు స్కానర్ల వరకు ఏర్పాటు చేశారు. 1857 నుంచి 1999 వరకు 19,960 వాల్యూమ్స్ ఉన్నాయి. రికార్డుల డిజిటలీకరణ బాధ్యతను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ప్రతి వాల్యూమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, పేపరు పాడవకుండా స్కానింగ్ చేస్తున్నారు.

షిఫ్టుల వారీగా విధి నిర్వహణ

డిజిటలీకరణను జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండు షిఫ్టులుగా ఏర్పాటు చేసి స్కానింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఉదయం 9 నుంచి 3 గంటల వరకు, 3 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ పనులు కొనసాగిస్తున్నారు.

ఈసీ సులువుగా పొందవచ్చు

ప్రస్తుతం ఏదైనా భూమికి సంబంధించి ఈసీ పొందాలంటే వ్యయ, ప్రయాసలు పడాల్సి వస్తోంది. ఒకవైపు పరిస్థితిని బట్టి నెలరోజులు కూడా అవుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ కొత్త విధానం పూర్తయితే పాత ఈసీలు కూడా కంప్యూటర్‌లో సులభంగా పొందే అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

▸▸16,960 వాల్యూమ్స్

జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 16,960 వాల్యూమ్స్ ఉన్నాయి. వీటిలో కడప అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 3522 వాల్యూమ్స్ ఉండగా, ఇప్పటివరకు 3330 డిజిటలైజేషన్ చేశారు. బద్వేలులో 1867 ఉండగా 1743, ప్రొద్దుటూరులో 2797 ఉండగా 135, దువ్వూరులో మాత్రం ఉన్న 84 వ్యాలూమ్స్ పూర్తయ్యాయి. జమ్మలమడుగులో 1966కుగాను 1963, కమలాపురం 1080కి గాను 1057, ముద్దనూరు 647కుగాను 517, మైదుకూరు 1130కుగాను 881, పులివెందుల 1959కుగాను 1269, వేంపల్లె 944కుగాను 765, సిద్దవటంలో 964కుగాను 88 వాల్యూమ్స్ స్కాన్ పూర్తి చేశారు.



ముమ్మరంగా డిజిటలీకరణ



జిల్లాలో 1857 నుంచి 1999 వరకు ఉన్న పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ముగించాలని ప్రయత్నిస్తున్నాం. కంప్యూటరీకరణ పనులు పూర్తయితే పాత రికార్డులను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు ప్రజలకు వేగవంతంగా అందే అవకాశం ఉంది. – చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబ సౌభాగ్యం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు

కడప రూరల్ : మహిళ ఆరోగ్యంతోనే కుటుంబం సౌభాగ్యంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆయుష్మాన్ భారత్, హెల్త్ వెల్‌నెస్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప నగరంలో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య సంరక్షణ పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్తపోటు, డయాబెటీస్, కేన్సర్ తదితర వ్యాధులు శారీరక శ్రమ లేకపోవడం వల్ల, సరైన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోకపోవడం వల్ల వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు ఉదయం శారీరక శ్రమతో కూడిన వ్యాయామం, సైకిల్ తొక్కడం, వాకింగ్ చేయడం వంటి ప్రక్రియలను చేపట్టాలన్నారు. ఈ వ్యాయామం వల్ల రక్తపోటు, డయాబెటీస్ తదితర వ్యాధులు నియంత్రణలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డీఎంవీ చలమారెడ్డి, ఆ శాఖ అధికారులు ప్రమీలాదేవి, మనోరమ, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పెన్షనర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ప్రకటించింది. ఆదివారం కడప నేక్‌నామ్ కళాక్షేత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఎన్నికల అధికారిగా నాగమునిరెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడిగా సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైఎస్సార్ జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామ్మూర్తినాయుడు, గౌరవాధ్యక్షుడిగా వెంకటరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా నాగమునిరెడ్డి, సహాధ్యక్షుడిగా రామకృష్ణ, కోశాధికారిగా నాగేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలయల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రంగనాయకులు, చెంచురెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు నెల్సన్ విజయ్‌కుమార్, అపూర్వసుందరి, దేవదానం, ఉమామహేశ్వర్, దేవరాజు, యానది, జాయింట్ సెక్రటరీలుగా సుబ్బరాయుడు, ఈశ్వరరావు, బాలసుబ్రమణ్యం, వెంకటయ్య, సత్యరాజు, పార్వతమ్మ, రామసుబ్బారెడ్డి, నాగరత్నాచారి, చలపతిగౌడ్, మల్లయ్య, సుభాన్, యల్లారెడ్డి, నాగయ్య రవీంద్రబాబురావులను ఎన్నుకున్నారు. వీరితోపాటు 30 మంది కార్యవర్గ ప్రతినిధులను ఎన్నుకున్నారు. అనంతరం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగమునిరెడ్డి, సలహాదారులుగా గానుగపెంట హనుమంతరావు, ఖాదర్‌బాషా, ఇలియాస్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు తెలిపారు.

ముగిసిన ఇస్తెమా ఆధ్యాత్మిక సమ్మేళనం



ఇస్తెమాలో పాల్గొన్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి దీని ఇస్తెమా (ముస్లింల ఆధ్యాత్మిక సమ్మేళనం) విజయవంతమైంది. శనివారం ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప తదితర ప్రాంతాలతోపాటు కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. హైదరాబాదుకు చెందిన పలువురు మతగురువులు అల్లా గొప్పతనం, ప్రవక్త చూపిన సన్మార్గం, దైవసందేశం, శాంతియుత జీవన విధానం, ఖురాన్ గొప్పతనం తదితర అంశాల గురించి వివరించారు. ఈ సమావేశాల్లో దాదాపు 20 వేల మందికిపైగా ముస్లింలు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికి నిర్వాహకులు వసతి, భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో పలు వస్తువులను కొనుగోలు చేశారు.

అంకెల్లో ఓటు.. అదే చెల్లుబాటు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఇలా..
- అక్షరాలు, గుర్తులు చెల్లవు
- బ్యాలెట్ పేపర్ విధానంలో ఓటింగ్
- ఎంస్వీప్ యాప్‌తో అవగాహన

బద్వేలు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు సమయం దగ్గర పడింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై చాలా మందికి అవగాహన ఉంది. గర్తులు ఉంటాయి. ఈవీఎంలను ఓటింగ్‌కు వినియోగిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు వాడతారు. అందులో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై స్వస్తిక్ గుర్తును వేసి ఓటు వేస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పూర్తి భిన్నంగా ఉంటుంది. అభ్యర్థులకు ప్రాధాన్యత ఓటు వేస్తారు. ఒక్కో ఓటరు తన ప్రాధాన్యతను బట్టి అభ్యర్థులందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. వీటిని కూడా అంకెల్లో వేయాలి.

బ్యాలెట్‌పై గుర్తులుండవు

పట్టభద్రులకు సంబంధించి పేర్లను గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర, రిజిస్టర్డ్ జాతీయ, రాష్ట్ర పార్టీ, తదుపరి స్వతంత్ర అభ్యర్థులకు అక్షర క్రమంలో వరుస సంఖ్య కేటాయిస్తారు. ఉపాధ్యాయ అభ్యర్థులందరూ స్వతంత్రులే కాబట్టి వారికి అక్షర క్రమం ప్రకారం వరుస కేటాయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లు, వాటికెదురుగా ఖాళీ బాక్స్‌లు ఉంటాయి. వీటిలో అంకెల్లో ఓటు వేయాలి. అంకెల్లో కాకుండా అక్షరాలు, టిక్ మార్క్, ముద్రలు వేస్తే చెల్లదు. ఓటరు ప్రాధాన్యత క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయచ్చు. ఓటు విధానంపై మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో కార్యక్రమాలను అధికార యంత్రాంగం చేపట్టింది.



ఎంస్వీప్ యాప్ ముఖచిత్రం

▸▸ఓటు వేయడమిలా..

- పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉంచిన వంగపూత (వైలెట్) రంగు స్కెచ్ పెన్‌తో ఓటు (నెంబర్) వేయాలి. ఇతర పెన్నులను ఉపయోగించరాదు.
- ఓటరు తాను ఓటు వేయదలచుకున్న అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో నెంబర్ వేయాలి.
- ఓటరు తనకు నచ్చిన అభ్యర్థులకు తాను ఇచ్చే ప్రాధాన్యతను బట్టి వారికి 1, 2, 3, ... నెంబర్లు వేయవచ్చు.
- అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉన్న గడి దాటకుండా నెంబరు వేయాలి. నెంబరులను 1, 2, 3...లలో లేదా రోమన్ నెంబరులలో కూడా వేయవచ్చు.



ఓటు వేయాల్సిన విధానంపై పోస్టర్

▸▸ఇలా చేస్తే చెల్లదు

- ఒకే నెంబరును ఇద్దరు అభ్యర్థులకు వేయకూడదు
- ఒక అభ్యర్థికి ప్రాధాన్యత ఓటు నెంబరులో వేసి మరొకరికి ముద్ర రూపంలో వేయకూడదు
- ప్రాధాన్యత ఓటు నెంబరులలో కాకుండా అక్షరాల్లో వేయకూడదు.
- ప్రాధాన్యత ఓటు 1 వేయకుండా మిగిలిన నెంబర్లు వేయకూడదు.
- అభ్యర్థి ఎదురుగా గడిలో అంకె బదులు రైట్, ఇంటు వంటి ఎటువంటి టిక్కులను వేయకూడదు.
- ఒకే అభ్యర్థికి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయకూడదు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలోనే ఓటు వేయాలి. గడిలో కాకుండా ఇతర ఏ ప్రాంతాల్లో వేసినా చెల్లదు.
- బ్యాలెట్ పేపరును సిబ్బంది సూచించిన విధానంలోనే మడత వేయాలి.



ఓటు వేయకూడని విధానంపై పోస్టర్

జిల్లాలో ముమ్మరంగా శనగల కొనుగోలు

- ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి గింజా కొంటాం
- రబీకి సంబంధించి జిల్లాలో 63.122 హెక్టార్లలో శనగపంట సాగు
- 17 వేల మెట్రిక్ టన్నులకు ఇప్పటికి 4,975 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- మార్క్‌ఫెడ్ డీఎం తాడిగొట్ల నరసింహారెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ



తాడిగొట్ల నరసింహారెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం

కడప అగ్రికల్చర్: జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది 63,122 హెక్టార్లలో శనగపంటను సాగు చేశారు. ప్రభుత్వం రైతులకు బహిరంగ మార్కెట్‌కంటే అధిక గిట్టుబాటు ధరను కల్పించి ముమ్మరంగా శనగలను కొనుగోలు చేస్తోంది. ఇందులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం తాడిగొట్ల నరసింహారెడ్డి తెలిపారు. ఈ విషయంపై ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా..

ప్రశ్న: జిల్లాలో శనగల కొనుగోలు ప్రణాళిక ఏంటి?

జవాబు: జిల్లాలో ఈ రబీలో 29 మండలాల పరిధిలో 63,122 హెక్టార్లలో శనగపంట సాగు చేశారు. ఇందుకు సంబంధించి గత నెల 13వ తేదీ నుంచి కొనుగోలును ప్రారంభించాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి రైతు నుంచి శనగలను కొనుగోలు చేస్తాం.

ప్ర: జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఎన్ని టన్నులు కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చారు?

జ: జిల్లావ్యాప్తంగా 22 కేంద్రాల ద్వారా 17 వేల మెట్రిక్ టన్నుల శనగల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఇప్పటి వరకు 4,975 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాము. మిగతా వాటిని కూడా కొనుగోలు చేస్తాము.

ప్ర: శనగల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు ఏంటి?

జ: శనగల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నాణ్యతా ప్రమాణాలను కేటాయించింది. ఇందులో ఇతర వ్యర్థాలు 1 శాతం, ఇతర పప్పు దినుసు గింజలు 3 శాతం, దెబ్బతిన్న పప్పు దినుసుగింజలు 3 శాతం, కొద్దిగా దెబ్బతిన్న, రంగలేని పప్పుదినుసు గింజలు 4 శాతం, పక్వానికి రాని, ముడత, కుచించుకుపోయిన పప్పు గింజలు 6 శాతం, ఇతర శనగ పంట రకాల గింజలు 2 శాతం, పురుగుపట్టిన పప్పు దినుసు గింజలు 4 శాతం, తేమ 14 శాతం ఉండాలి. ఈ నిబంధనలకు లోబడే కొనుగోలు చేస్తాం.

ప్ర: ఈ శనగల కొనుగోలుకు ఖాళీ సంచులను మీరే ఇస్తారా?

జ : ఈ ఏడాది దిగుబడులకు అనుగుణంగా శనగల కొనుగోలుకు సంబంధించి 4 లక్షల ఖాళీ సంచులు(ఖాళీ బస్తాలు) అవసరమని గుర్తించాము. అయితే ఇప్పటికే 3 లక్షల బస్తాలను కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలకు చేరవేశాము. రైతులు ఎవరూ తమ సంచులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

ప్ర: ఒక బస్తా శనగల తూకం ఎన్ని కిలోలు ఉండాలి?

జ : ఒక బస్తాకు శనగలు 50 కిలోలు ఉండాలి. దీంతోపాటు సంచి(బస్తా)తూకం 600 గ్రాములు. ఇలా మొత్తంగా సంచితో కలుపుకుని 50 కేజీల 600 గ్రాములు ఉండాలి. అంతకు మించి ఒక గ్రాము కూడా ఎక్కువ తీసుకోకూడదు. అంతకంటే ఎక్కువ తీసుకుంటే మా దృష్టికి తీసుకురావాలి.

ప్ర: నల్లగింజ శాతం ఎక్కువగా ఉన్న శనగ రైతులు కూడా కొనాలని అడుగుతున్నారు. వారి పరిస్థితి ఏంటి?

జ: ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల ప్రకారం నల్ల గింజలు కేవలం 4 శాతం మాత్రమే ఉండాలి. అంతకన్నా ఎక్కువ ఉంటే కొనేదానికి లేదు. కానీ కొంత మంది రైతులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతానికి ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల ప్రకారమే కొనుగోలు చేస్తున్నాం. అనుమతులు వచ్చాక దాని విషయం ఆలోచిస్తాం.

ప్ర: కొనుగోలు కేంద్రాలలో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి?

జ: రైతులు కొనుగోలు కేంద్రాల దగ్గరకు తమ వాహనంలో శనగలు తీసుకుని వచ్చినప్పటి నుంచి అక్కడ శనగలు దించడం, కింద పోయడం, జల్లెడ పట్టడం, తిరిగి మార్క్‌ఫెడ్ తరపున సరఫరా చేసిన కొత్త బస్తాలలో నింపడం, తూకం వేయడం, నెట్టు కట్టడం తరువాత గోడౌన్‌కు తరలించడానికి లారీలో నింపడం వరకు హమాలీ ఖర్చులను రైతులే భరించాల్సి ఉంటుంది. హమాలీ డబ్బులు హమాలీలే తీసుకోవాలి. హమాలీ డబ్బులు కాకుండా రైతులు ఏ ఒక్కరికి ఒక రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా ఇలా కాకుండా డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: కొనుగోలుకు సంబంధించి ఏవైనా అనుమానాలు ఉంటే ఎవరిని కలవాలి?

జ: కొనుగోలుకు సంబంధించి రైతులకు ఏవైనా అనుమానాలు, సందేహాలు ఉంటే రైతు భరోసా కేంద్రం సిబ్బందిని కానీ, మార్క్‌ఫెడ్ సిబ్బందిని కానీ కలవాలి.

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



సంఘటన స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకుని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి మానవత్వ చాటుకున్నారు. వివరాలు..నిడుజివ్వి గ్రామానికి చెందిన కుల్లాయప్ప రోడ్డు దాటుతుండుగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. 108 వాహనంలో కుల్లాయప్పను ఆసుపత్రికి తరలించే వరకు అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బైక్ దొంగ పోలీసులకు అప్పగింత

జమ్మలమడుగు : బైక్ ఎత్తుకెళ్లిన ఓ యువకుడిని గ్రామస్తులు పట్టుకుని ఆదివారం తలమంచిపట్నం పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన యువకుడు నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డి పల్లెకు చెందినవాడిగా గుర్తించారు. స్థానికుల కథనం మేరకు మైలవరం మండలం వద్దిరాల గ్రామానికి చెందిన షట్కారీ గురు గంగాధర్ స్నేహితులతో కలసి ఆదివారం చేపలు పట్టడానికి వెళ్లారు. బైక్‌ను వద్దిరాల– గొల్లపల్లి ప్రధాన రహదారిపై నిలిపారు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు.దీంతో అక్కడ ఉన్నవారితో మాట్లాడగా ఇప్పుడే ఓ యువకుడు బైక్ తీసుకెళ్లారని చెప్పారు.వెంటనే వేరే వాళ్ల బైక్ తీసుకెళ్లి వెతకడం ప్రారంభించారు. ఓగ్రామం వద్ద బైక్‌తో ఉన్న యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై మైలవరం ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణను వివరణ కోరగా వద్దిరాల గ్రామస్తులు యువకుడిని అప్పగించింది వాస్తవమే అన్నారు. అయితే అతడికి మానసిన పరిస్థితి బాగా లేక పోవడంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న విచారణ తెలిసిందన్నారు. యువకుడిపై బైండోవర్ కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో 262 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై ఆదివారం మొత్తం 262 కేసులను నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలను నడిపిన వారిపై 214, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 48 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

పశువులకు టీకా రక్షణ

- గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు
- జిల్లాలో మొదలైన వ్యాక్సినేషన్



ఆవుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారి రవీంద్రారెడ్డి

కడప అగ్రికల్చర్/వల్లూరు : గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పశువైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా గాలికుంటు టీకా కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. గాలికుంటు వ్యాధి సోకితే పాలిచ్చే గేదెలు, ఆవుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గి పోతుంది. ఒక్కో సారి వాటి పొదుగులపై కూడా బొబ్బలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. దీని వలన బ్యాక్టీరియా ఆశించి చీము కారుతూ ఇతర రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. దేశ వాళీ పశువుల కంటే సంకర జాతి పశువుల్లో వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాధి కలిగిన తల్లి పాలను తాగిన దూడలు మరణించే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి నివారణకు ఆయుధం వ్యాక్సినే. జిల్లాకు 400679 డోసుల వ్యాక్సిన్ మంజూరైంది. ప్రతి ఒక్క రైతు తమకు సంబంధించిన పశువులకు తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా పశువైద్యాధికారి శారదమ్మ సూచించారు.

ఈ వ్యాధికి గురైన పశువుల్లోని అంతస్రావాలు, వాటి లాలాజలం, పాలు, వాటి పుండ్ల నుండి కారే రసి లాంటి విసర్జనల వల్ల ఈ వ్యాధి కారక వైరస్‌లు వ్యాపిస్తాయి. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా గాలిలో తేమ శాతం అధికంగా వున్నపుడు త్వరితగతిన వ్యాపించే అవకాశం ఉంది. వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న వాటికి కలుషిత ఆహారం, నీరు, వ్యవసాయ పనిముట్లు మొదలైన వాటి వల్ల వ్యాధి వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి కలిగిన పశువులను ఒక చోటు నుండి మరొక చోటికి రవాణా చేసే క్రమంలో కూడా వ్యాధి వ్యాప్తి చేందే అవకాశాలు ఉన్నాయి.

వ్యాధి లక్షణాలు

ఈ వ్యాధి వల్ల గర్భధారణ విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేక పోవడంతో పాటు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఇది పికార్న లాంటి వైరస్‌ల వల్ల సోకే అంటు వ్యాధి. దీని వల్ల పశువు మేత మేయదు, నెమరు వేయదు. మందకొడిగా ఉంటుంది. తీవ్రమైన జ్వరం వస్తుంది. నోటిలో బొబ్బలు కనిపిస్తాయి. ఇవి పగిలి పుండ్లుగా మారి నోటి నుండి చొంగ కారుతుంది. కాలి గిట్టల మధ్య ఏర్పడే బొబ్బలు, పుండ్ల వల్ల పశువు కుంటుతుంది. పని చేసే శక్తి తగ్గిపోతుంది.పొదుగు పైన బొబ్బలు ఏర్పడి వాపునకు దారి తీస్తుంది. పాల ఉత్పత్తి తగ్గి పోతుంది.వ్యాధి నిరోధక శక్తి తక్కువగా, బలహీనంగా వుండే యుక్త వయసు పశువుల్లో వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుంది. చికిత్స కన్నా నివారణే ముఖ్యం



పశువు గిట్టలకు సోకిన గాలికుంటు వ్యాధి

నివారణా చర్యలు

- వ్యాధి ప్రబలిన ప్రదేశాలకు ఆరోగ్యంగా ఉన్న పశువులను తరలించ కూడదు. వ్యాధి వ్యాపించి ఉన్న ప్రదేశాల నుంచి పశువులను కొనుగోలు చేయరాదు. కొత్తగా కొనుగోలు చేసిన పశువులను మిగిలిన వాటికి దూరంగా ఉంచాలి.
- వ్యాధి సోకిన పశువుల గిట్టలు, పుండ్లను ఒక శాతం పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. కాళ్లపై బొబ్బలకు యాంటీ సెప్టిక్ , నోటిలోని పుండ్లకు బోరిక్ యాసిడ్‌తో పూత పూయాలి. ఈగలు వాలకుండా వేప నూనె, లారాజెంట్ లాంటి మందులు వాడాలి. జబ్బుపడిన పశువులకు ఉపశమనం కలిగించే దాణా మాత్రమే పెట్టాలి. పశు వైద్యాధికారుల సూచనల మేరకు యాంటి బయాటిక్ మందులను వాడాలి నిర్ణీత సమయాల్లో వ్యాధి నిరోధక టీకాలను వేయించడం చాలా ముఖ్యం.

డివిజన్	ఆవులు	గేదెలు	మొత్తం	మంజూరైన దోసులు
కడప	14278	203500	217778	200636
పులివెందుల	10944	42786	53730	49501
జమ్మలమడుగు	18187	145217	163404	150542

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



జిల్లాలోని రైతులు ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంటుంది.ఈ నెల 2 నుంచి టీకా కార్యక్రమం ప్రారంభమైంది.రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– శారదమ్మ, జిల్లా పశువైద్యాధికారి

విజిలెన్స్ అధికారుల దాడులు

కడప అర్బన్ : జిల్లాలో కడప నగరం, మైదుకూరు పట్టణంలలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం కడప నగరం, మైదుకూరు పట్టణాలలో చికెన్, మటన్,చేపలు అమ్ముతున్న 43 దుకాణాలపై దాడులను నిర్వహించారు. తూనికలు, కొలతలలో పలు ఉల్లంఘలనపై తూకాలు తక్కువ ఉండటం, అనుమతులు లేని తక్కెడలను ఉపయోగించడం, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లకు స్టాంపింగ్ లేకుండా ఉండటాన్ని గుర్తించారు. 14 కేసులను నమోదు చేసి లీగల్ మెట్రాలజీ సెక్షన్ 8/25, 2009 ప్రకారం జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్లు టి.. రెడ్డెప్ప, పి. రామకృష్ణ, డిప్యూటీ ఈఈ లోకేశ్వర్ రెడ్డి, ఏజీ జి. శ్రీనివాసులు, ఏఓ బాలగంగాధర్ రెడ్డి, ఏఈఈలు కిశోర్‌కుమార్, వి. అశోక్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, జయదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ స్థలానికి సంబంధించి నకిలీ ఆధార్‌కార్డుతో రిజిస్టర్ చేసిన కేసులో కమలాపురానికి చెందిన లేవాకు రాజేంద్రనాథ్ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సంఘటనలో బాధితుడు రామిరెడ్డి ఫిర్యాదు మేరకు తనకు సంబంధించిన స్థలాన్ని నకిలీ ఆధార్‌కార్డు తయారు చేసి డాక్యుమెంట్లను లేవాకు రాజేంద్రనాథ్‌రెడ్డి రిజిస్టర్ చేయించుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. తరువాత నిందితుడిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు.

సూత్ర ధారులెవరు?

అవినీతి వీఆర్‌ఏ కోలా చుట్టూ బిగుస్తున్న ఉచ్చు



అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టాలని నినాదాలు చేస్తున్న బాధితులు

గాలివీడు : ఇంటిపట్టాలు ఇవ్వజూపి లక్షల రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడిన అవినీతి వీఆర్‌ఏ కోలా రమణ బాధితుల ఫిర్యాదుతో పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. అక్రమ వసూళ్లలో భాగస్వాములు ఎవరు? ఇంటి దొంగలు ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా, గాలివీడు మండల కేంద్రంలో తండ్రి అనారోగ్యంగా ఉన్నాడనే కారణంతో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న కోలా రమణ ప్రభుత్వ భూముల్లో నివాసస్థల పట్టాలను, అసైన్డ్ భూములను ఇప్పిస్తానని చెప్పి అక్రమంగా లక్షల రూపాయల నగదు ఫోన్ పే రూపంలో వసూళ్లకు పాల్పడినట్లు బాధితులు ఆరోపించారు. బాధితులకు ప్రాంసరీనోట్లు, స్టాంప్ పేపర్లపై తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం రుణం తీసుకున్నట్లుగా రాయించి ఇచ్చాడు. అయితే రోజులు గడిచే కొద్దీ బాధితుల సంఖ్య పెరిగింది. కానీ నివాస స్థల పట్టాలు , నగదు తిరిగి చెల్లించలేదు. దీంతో సదరు అవినీతి వీఆర్‌ఏ అసలు రంగు బయటపడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం అవినీతి వీఆర్‌ఏను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో తమ పేర్లు ఎక్కడ బయటకొస్తాయోనని స్థానిక రెవెన్యూ అధికారుల గుండెలలో గుబులు మొదలైంది. తమశాఖ పరువు ఎక్కడ పోతుందోనని అవినీతి భాగస్వాముల పేర్లు బహిర్గతం కాకుండా గుట్టుగా ఉంచేందుకు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. వెంటనే సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

వల్లూరు: కడప – తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు – కొప్పోలు బస్టాపుల మధ్య ఆదివారం తెల్లవారు జామున అదుపు తప్పి కోళ్ల లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పుంగనూరు నుంచి కోళ్లను లోడు చేసుకుని కమలాపురం వస్తున్న లారీ వల్లూరు సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ , క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కోళ్లు అధిక సంఖ్యలో మృతి చెందాయి.

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



కూరగాయల అలంకరణలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట – బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతర వారాల్లో భాగంగా రెండో ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. ఆలయ ఆవరణలోని వీరభద్ర స్వామి, అంజనేయస్వామి, సాయిబాబాలకు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్ కుమార్ ఏర్పాట్లను చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్‌ఐ బి. అరుణ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

'భారతి సిమెంట్స్'కు ఫైవ్ స్టార్ రేటింగ్



కేంద్ర గనుల శాఖ మంత్రి జోషి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బీసీసీపీఎల్ ప్రతినిధులు

కమలాపురం : వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం నల్లింగాయపల్లెలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)కు ఫైవ్ స్టార్ రేటింగ్ వచ్చినట్లు ప్లాంట్ సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీన నాగ్‌పూర్‌లో జరిగిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ 75వ వార్షికోత్సవ వేడుకలలో కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషి చేతుల మీదుగా ఈ అవార్డును సీఎంఓ సాయి రమేష్, మైన్స్ జీఎం సుధాకర్ రాజు, చీఫ్ మేనేజర్ భార్గవ్ రెడ్డి అందుకున్నారు.

బీసీసీపీఎల్‌కు చెందిన లైఫ్ స్టోన్ మైన్స్‌కు, అలాగే సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌కు గాను ఈ అవార్డు లభించినట్లు ఆయన వివరించారు. మైన్స్‌లో అవలంభించిన సైంటిఫిక్ పద్ధతులు, మైన్స్ కన్జర్వేషన్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో 2021–22 సంవత్సరానికి ఈ అవార్డు లభించిందని సీఎంఓ తెలిపారు. ఇందుకోసం కృషి చేసిన పలు విభాగాల కార్మికులకు ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని ఆయన అన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



సురేంద్ర మృతదేహం

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారి నుండి వల్లూరు గ్రామంలోకి వెళ్లే దారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన సురేంద్ర అనే యువకుడు మృతి చెందాడు. సురేంద్ర గణేష్ పురం నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న గంగయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య , ఒక కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా

సురేంద్ర కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు సంఘటనా స్థలంలో మృతదేహంతో ధర్నాకు దిగారు. కమలాపురం సీఐ సత్య బాబు, వల్లూరు ఎస్‌ఐ విష్ణు వర్ధన్‌లు వారికి సర్దిచెప్పి ధర్నాను విరమింప చేశారు. కాగా సంఘటనా స్థలంలో వారు తిరిగి ధర్నాను కొనసాగించారు.

కారుబైక్ ఢీ: ఒకరి మృతి



మృతి చెందిన శివశంకర్ (ఫైల్)

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ కొత్త మంగంపేట వద్ద కడప – తిరుపతి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓబులవారిపల్లె మండలం ముదినేపల్లికి చెందిన మాచుపల్లి శివశంకర్(21) అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... రైల్వేకోడూరు మండంలోని తుంగావాండ్లపల్లె నుంచి బావ బావమరుదులైన మాచుపల్లి శివశంకర్, శ్రీనివాసులు ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం పుల్లంపేట మండలం రెడ్డిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలో కొత్త మంగంపేట వద్దకు రాగానే కడప నుంచి తిరుపతి వెళుతున్న ఓ కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టి ఎదురుగా కడప వైపు వెళుతున్న ఆర్‌టీసీ బస్సును కూడా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న శివశంకర్ మృతి చెందగా ఆయన బావ శ్రీనివాసులు గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. చిత్తూరుకు చెందిన పద్మనాభం, సురేష్‌లు కారులోనే ఇరుక్కు పోయి అపస్మారకస్థితికి చేరుకున్నారు. స్థానికులు గడ్డపారలు, బలమైన తాళ్ల సహాయంతో కారు తలుపులను లాగి వారిని బయటకు తీశారు. 108లో రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్సలు నిర్వహించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేటకు తరలించారు.కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ముదినేపల్లిలో విషాదచాయలు

ముదినే పల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ చంగల్రాయుడు దంపతులకు శివశంకర్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివశంకర్ ఐటీఐ పూర్తి చేశాడు.ప్రస్తుతం అమ్మమ్మ గారి గ్రామమైన తుంగావాండ్లపల్లెలో ఉండేవాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



గాయపడిన తుంగా శ్రీనివాసులు, పద్మనాభం, సురేష్

పార్శిల్ ఇచ్చి తిరిగి వస్తూ..



అంజనేయులు(ఫైల్)

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై దేవపట్ల మిట్ట సమీపంలో ఆదివారం బైక్, కారు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాయచోటి మండలం మద్దిరవాండ్లపల్లె హరిజనవాడకు చెందిన చిట్లూరి ఆంజనేయులు (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ఆంజనేయులు రాయచోటిలోని ఓ కళాశాలలో చదువుకుంటూ ఫ్లిప్‌కార్ట్‌లో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో దేవపట్లలో పార్సిల్ ఇచ్చేసి రాయచోటికి వెళుతుండగా దేవపట్ల మిట్ట సమీపంలోని హోటల్ వద్దకు రాగానే పీలేరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగ గాయపడిన అంజనేయులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి వివాహంకాలేదు. తల్లి, దండ్రులు గతంలో చనిపోయినట్లు సమాచారం. ఆంజనేయులుకు ముగ్గురు సోదరులున్నారు. అన్న మృతి చెందడంతో సోదరులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సర్వమత సన్నిధి.. నీలకంఠరావుపేట దర్గా

- ఆధ్యాత్మికతకు నిలయం
- నేటి నుంచి ఉరుసు ప్రారంభం



సద్గురు దర్గా స్వామిజీల సమాధి

రామాపురం : ఆరు దశాబ్దాల కిందట నిర్జీవంగా ఉండి సమాధుల చుట్టూ గోడలు ఉండే ప్రదేశం. నేడు ఎందరో భక్తులకు మానసిక ఉల్లాసం కలిగిస్తూ, వారి కోర్కెలు తీరుస్తూ ఆధ్యాత్మిక నిలయంగా మారింది. అదే శ్రీ నీలకంఠ్రావుపేట దర్గా. ఇది అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలో దక్షిణ దిశగా ఒక కిలోమీటరు దూరంలో ఉంది. హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా, పవిత్ర దర్శనీయస్థలంగా వెలుగొందుతోంది. కడప –చిత్తూరు ప్రధాన జాతీయ రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వెలిసిన ఈ దర్గాలో ఏటా ఫల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుపుతారు. సద్గురు హజరత్ దర్బార్ ఆలీషావలీ రహంతుల్లా అలైహిబాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. దత్త పీఠానికి చెందిన మహాపూర్ణత్వ పురుషులైన వీరిద్దరు 147 సంవత్సరంలో ఈనిర్జన స్థలంలో సజీవసమాధి పొందారని పూర్వీకులు చెబుతున్నారు. నాడు వీరు నాటిన మొక్కలు నేటికీ సజీవ సాక్ష్యాలుగా మిగిలాయి. ఉరుసు సందర్భంగా మహాజెండాను ఊరేగింపుగా తీసుకెళ్లి చెట్ల వద్ద ఉంచి ఫతేహా నిర్వహిస్తారు.

- దర్గా సన్నిధిలోనే షిర్డీ సాయినాథుని పంచలోహ విగ్రహంతో కూడిన మందిరం నిర్మించారు. అలాగే 1–10వ తరగతి వరకు సుందరమైన భవనాల్లో తరగతి గదులు ఏర్పాటు చేసి సాయి విద్యామందిరం పేరిట ఉచిత భోజనం అందిస్తున్నారు. విద్యాబోధన కొనసాగించడం గమనార్హం.
- శ్రీదర్గాపీఠాధిపతి సద్గురు స్వామీజీకి చేదోడుగా ఉంటూ భక్తులను ప్రేమగా పలకరించే రంగనాయకమ్మ శివైక్యం పొందారు. తర్వాత 14 సంవత్సరాలకు సద్గురు స్వామీజీ శివైక్యం పొందారు వీరిద్దరికి మందిరం నిర్మించి, పంచలోహ విగ్రహాలు ఏర్పాటు చేసి నిత్యంపూజలు నిర్వహిస్తున్నారు.



సద్గురు హజరత్ దర్బార్ అలీషావలీరంహంతుల్లా అలైహిబాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ సమాధులు

నేడు ఉరుసు ఉత్సవం

శ్రీ సద్గురు హజరత్ దర్బార్ ఆలీషావలి రమతుల్లా అలైబాబా, శ్రీ జలీల్ మస్తాన్ వలీ బాబా గార్ల ఉరుసు ఉత్సవాలు ఈనెల 6 నుంచి జరుగుతాయి. 6న గంధమహోత్సవ, 7న జెండా మెరవణి, ఉరుసు, రాత్రి హిందూ, మహమ్మదీయ సోదరుల సహకారంతో ముంబైకి చెందిన ఖలీల్ సైదా, బెంగళూరుకు చెందిన అస్మాని నిఖిల్‌లతో ఖవాలీ, 8న తహలీల్‌తో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.